ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 95 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 15 జులై 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



# తెరచుకున్న భాండాగారం

## లోపల అసలేం జరిగింది?

పూరీ, జులై 14 (ప్రభాత ఉదయం): నాలుగు దశాబ్దాల అనంతరం ఒడిశాలోని పూరీ జగన్నాథుడి రత్న భాండాగారం ఎట్టకేలకు తెరచుకుంది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యులు మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం లోపలికి చేరుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, ముందస్తుగా నిర్ణయించిన సమయం ప్రకారం 1.28గంటలకు రహస్య గదిని తిరిగి తెరిచారు. సాయంత్రం 5.20 గంటలకు బయటకు వచ్చారు. "లోపలికి వెళ్లి చూడగా.. భాండాగారానికి మూడు తాళాలు ఉన్నాయి. జిల్లా అధికారుల వద్ద ఉన్న ఏ తాళంచెవి పనిచేయలేదు. మార్గదర్శకాల ప్రకారం, మేజిస్ట్రేట్ సమక్షంలో మూడు తాళాలను పగలగొట్టాం. అనంతరం గది లోపలికి ప్రవేశించాం. అక్కడ బీరువాలో, చెక్క పెట్టెల్లో ఉన్న ఆభరణాలను పరిశీలించాం. అనంతరం ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం

..మిగతా 2లో

# డొనాల్డ్ ట్రంప్‌పై కాల్పులు.. అమెరికా ఎన్నికల వేళ సంచలనం

**అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై కాల్పులు జరిపిన సంఘటన ప్రస్తుతం అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో సంచలనంగా మారింది. రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా బరిలోకి దిగిన డొనాల్డ్ ట్రంప్.. ప్రచారంలో దూసుకెళు తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ట్రంప్ గాయాల పాలయ్యారు. వెంటనే అలర్ట్ అయిన సెక్యూరిటీ సిబ్బంది.. ఆయనను ఆస్పత్రికి తరలించారు.**



పెన్సిల్వేనియా, జులై 14 (ప్రభాత ఉదయం): అమెరికా అధ్యక్ష ఎన్నికల వేళ సంచలన పరిణామం చోటు చేసుకుంది. మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష బరిలో నిలిచిన డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం జరిగింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా సభలో ప్రసంగిస్తున్న డొనాల్డ్ ట్రంప్‌పై దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ట్రంప్‌కు బుల్లెట్ గాయాలు అయ్యాయి. వెంటనే స్పందించిన ట్రంప్ సెక్యూరిటీ సిబ్బంది.. కాల్పులు జరిపిన ఒక దుండగుడిని కాల్చి చంపారు. ఈ ఘటనతో ఒక్కసారిగా అమెరికాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పెన్సిల్వేనియాలో తాజాగా నిర్వహించిన అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. డొనాల్డ్ ట్రంప్ ప్రసంగిస్తున్న సమయంలో.. అక్కడ ఉన్న వారిలో ఉన్న దుండగులు.. ఒక్కసారిగా ట్రంప్‌పైకి కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఓ బుల్లెట్ ట్రంప్ చెవికి గాయాలు అయ్యాయి. వెంటనే ఆయన ప్రసంగిస్తూనే వేదికపైనే కుప్పకూలిపోయారు. దీంతో మెరుపు వేగంతో స్పందించిన ట్రంప్ సెక్యూరిటీ సిబ్బంది.. ఆయనను కింది నుంచిపైకి లేపి అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలోనే ఒక దుండగుడిని సెక్యూరిటీ సిబ్బంది కాల్చి చంపారు. ఈ ఘటనలో ట్రంప్ గాయపడటంతో వెంటనే ఆయనను సెక్యూరిటీ సిబ్బంది హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఇక దుండగుల్లో ఒకరిని కాల్చి చంపగా.. మరోవ్యక్తిని సెక్యూరిటీ సిబ్బంది అదుపులోకి

..మిగతా 2లో

# హయత్‌నగర్‌కు మెట్రో రైలు

## గుడ్ న్యూస్ వినిపించిన సీఎం రేవంత్ రెడ్డి

### కొత్త ఫిల్మ్ సిటీతో పాటు కొత్త నగరాన్ని నిర్మిస్తామన్న రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జులై 14 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ వాసులకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ వినిపించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ లష్కర్‌గూడలో గౌడ కులస్థుల కోసం "కాటమయ్య రక్షణ కవచం" పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మికులతో సరదాగా ముచ్చటించి.. వారి సాధకబాధకాలు తెలుసుకున్నారు. అనంతరం వారికి కిట్లు అందించి.. ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన రేవంత్ రెడ్డి.. మూడు కీలక ప్రకటనలు చేశారు. హైదరాబాద్‌లో రీజనల్ రింగ్ రోడ్డుతో పాటు భవిష్యత్‌లో రేడియల్ రోడ్స్ అభివృద్ధి చేసుకోబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అలా జరిగితే.. రంగారెడ్డి జిల్లాలోని భూములు బంగారం అవుతాయని సీఎం చెప్పుకొచ్చారు. మరోవైపు.. హైదరాబాద్ మెట్రో పొడిగింపులో భాగంగా.. త్వరలోనే హయత్‌నగర్‌కు మెట్రో రైలు రాబోతుందని తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ప్రణాళికలు ఇప్పటికే సిద్ధమయ్యాయని రేవంత్ రెడ్డి వెల్లడించారు.





రంగారెడ్డి జిల్లాకు త్వరలోనే మహర్దశ పట్టబోతుందని.. సైబరాబాద్ పేరుతో ఎలా అభివృద్ధి జరిగిందో అలాగే ఇక్కడ కూడా అభివృద్ధి చేస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. న్యూయార్క్ సిటీతో పోటీ పడేలా మహేశ్వరంలో కూడా కొత్త సిటీని నిర్మించబోతున్నట్టు రేవంత్ రెడ్డి ప్రకటించారు. శంషాబాద్‌లో మెడికల్ టూరిజం హబ్, రాచకొండ ప్రాంతంలో అద్భుతమైన ఫిల్మ్ ఇండస్ట్రీ కూడా ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ఇప్పటికే అద్భుతంగా రామోజీ ఫిల్మ్ సిటీ ఉందని.. దాంట్లో దేశవ్యాప్తంగా ఉన్న సినిమావాళ్లు వచ్చి షూటింగులు జరుపుకుంటున్నారని.. ఇక అంతకంటే మిన్నగా మరో ఫిల్మ్ సిటీని ప్రభుత్వం నిర్మిస్తుందని వెల్లడించారు.



జూరాల ప్రాజెక్టులో జరుగుతున్న నీటిమట్టం

# ఆల్మట్టికి పెరుగుతున్న వరద

## జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు

## సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 14(ప్రభాత ఉదయం) కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టుకు వరద తాకిడి మొదలైంది. వారం రోజులుగా మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణా బేసిన్‌లోని ఆల్మట్టి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం ఆల్మట్టి ప్రాజెక్టులోకి దాదాపు 28వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. దాంతో ఆల్మట్టికి జలకళ సంతరించుకుంది. ఆల్మట్టికి వరద ప్రవాహం క్రమంగా పెరగవచ్చని, నదీ పరివాహక ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని కర్ణాటక అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ సీజన్ లో ఆల్మట్టికి వరద ప్రవాహం పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం నాటికి ఆల్మట్టి ప్రాజెక్టు 129.72 టీఎంసీల నీటి సామర్థ్యానికి గాను దాదాపు 91.130 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 129.72 టీఎంసీల నీటి

..మిగతా 2లో

# తెలంగాణలో బోనాలు ఎందుకు తీస్తారు?

## చారిత్రక ప్రాశస్త్యం ఏంటంటే..?



హైదరాబాద్,జులై 14(ప్రభాత ఉదయం)తెలంగాణలో బోనాల పండుగ మస్త్ ఫేమస్. పోతరాజుల నృత్యాలు,శివసత్తుల పూనకాలతో పల్లె నుంచి పట్నం వరకు బోనాల పండుగతో సందడిగా మారుతుంది. ముఖ్యంగా హైదరాబాద్ జంటనగరాల్లో.. బోనాల సందడి అంతా ఇంతా కాదు. బోనాల వేడుకను తెలంగాణ ఆవిర్భావం తర్వాత ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తూ వస్తున్నది. ఏటా ఆషాఢ మాసంలో తొలి గురువారం లేదంటే ఆదివారం వేడుకలు ప్రారంభమవుతుంటాయి. అయితే,బోనాల పండుగకు ఎంతో చారిత్ర పాశస్త్యం ఉన్నది. అజ్ఞాత యుగం నుంచే ఈ బోనాల సంప్రదాయం కొనసాగుతున్నది. కొండ కోనల్లో మనిషి జీవించిన కాలంలో ఒక రాయిని దేవతగా చేసుకుని ప్రకృతి తనకు ఇచ్చిన పత్రి,పువ్వు,కొమ్మ, పసుపు కుంకుమ, నీళ్లు,ధాన్యం,కూరగాయలను



సమర్పించాడు. అప్పుడు ప్రారంభమైన ఈ సమర్పణనే బోనాల వరకు వచ్చింది. పూర్వ కాలం నుంచే ఉన్న ఈ బోనాలకు ఒక్కో ప్రాంతంలో ఒక్కో చరిత్ర ఉంది. పల్లవరాజు కాలంలోనే..600 ఏళ్ల నాటి పల్లవ రాజుల కాలంలో తెలుగు నేలపై బోనాల పండుగ ప్రాశస్త్యం పొందిందని ప్రతీతి. 15వ శతాబ్దంలో శ్రీకృష్ణ దేవరాలు ఏడు కోల్ల ఎల్లమ్మ నవదత్తి

..మిగతా 2లో

# హిజ్రాల ఆగడాలు అడ్డుకోవాలని డీజీపీకి ఫిర్యాదు

హైదరాబాద్,జూలై 14 (ప్రభాత ఉదయం): పెళ్లిళ్లు,గృహ ప్రవేశం,షాపు ఓపెనింగ్ సహా ఏ ఫంక్షన్ చేసుకోవాలన్నా హిజ్రాల ఆగడాలు మితిమీరుతున్నాయని డీజీపీకి ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు.'ఈ సమస్య చాలా పెద్ద మొత్తంలో ఉంది. ఫంక్షన్లు చేసుకునే వారికి పోలీసులు భరోసా ఇవ్వండి. లేదంటే వారు భయపెట్టి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారు' అని రాచకొండ,సైబరాబాద్,హైదరాబాద్ సిపిలను ఆయన ట్యాగ్ చేశారు. గతంలో హిజ్రాలకు పోలీసులు వార్నింగ్ ఇచ్చిన వీడియోను పంచుకున్నారు.





# క్షమాపణ చెప్పండి

## సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్,జూలై 14 (ప్రభాత ఉదయం): రేవంత్ సర్కారుపై తీవ్ర విమర్శలు గుప్పించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. రేవంత్‌రెడ్డి రాజకీయం నిరుద్యోగం తీర్చుకోవడానికి, నాడు రాష్ట్రంలోని యువతను రెచ్చగొట్టారని మండిపడ్డారు. ఇప్పుడు నిరుద్యోగులు ఆందోళన చేస్తుంటే

..మిగతా 2లో

# సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన హీరో సాయి ధరమ్ తేజ్



హైదరాబాద్, జులై 14 (ప్రభాత ఉదయం): టాలీవుడ్ యంగ్ హీరో సాయి ధరమ్ తేజ్.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో రేవంత్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు సాయిధరమ్. సోషల్ మీడియాలో చిన్నపిల్లలపై జరుగుతోన్న దుష్ప్రచారాన్ని సాయిధరమ్ ఖండించిన సంగతి తెలిసిందే. దీనిపై మా అసోసియేషన్ కూడా స్పందించింది. పిల్లలపై జుగుప్సాకరమైన కామెంట్లు చేస్తోన్న రాక్షసులపై చర్యలు తీసుకోవాలంటూ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరారు. ఫన్ అండ్ డ్యాంక్ పేరుతో పిల్లలపై ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతోన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు సాయిధరమ్‌తేజ్. ఆ విషయంపైనే ఇప్పుడు సీఎం రేవంత్‌ను సాయిధరమ్‌తేజ్ కలిసినట్టు తెలుస్తోంది. ప్రణీత్ హనుమంతు అనే ఓ తెలుగు యూట్యూబర్ ఆన్‌లైన్‌లో ఓ డిబేట్‌ను చేపట్టాడు. ఇందులో కొందరు వ్యక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తండ్రీ, కూతుళ్ల మధ్య సాగే ఓ వీడియోపై నోటికొచ్చినట్లు వాగారు. అసభ్య కామెంట్స్ చేసి, అదేదో గొప్ప పని చేస్తున్నట్లు విరగబడి

..మిగతా 2లో

ప్రభాత ఉదయం

# తెలంగాణలో బోనాలు ఎందుకు తీస్తారు?





మొదటి పేజీ తరువాయి...

ఆలయాన్ని నిర్మించి,బోనాలు సమర్పించారట.1676లో కరీంనగర్ హుస్నాబాద్‌లో ఎల్లమ్మగుడిని సర్వాయి పాపన్న కట్టించి,ఆ దేవతకు బోనాలు సమర్పించినట్లు కైఫీయతుల్లో గౌడనాడులు గ్రంథంలోనూ ఉన్నది.ఇక హైదరాబాద్ చరిత్రను గమనిస్తే..1869లో జంటనగరాల్లో ప్లేగు వ్యాధి మహమ్మారిలా వచ్చి ప్రబలడంతో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు.దైవాగ్రహానికి గురయ్యామని భావించిన అప్పటి ప్రజలు..గ్రామ దేవతలను శాంతపరచడానికి,ప్లేగు వ్యాధి నుంచి తమను తాము కాపాడుకోవడానికి చేపట్టిన క్రతువే ఈ బోనాలు.1675లో గోల్కొండను పాలించిన లబుల్ హాసన్ కుతుబ్ షా (తానీషా ) కాలంలో బోనం పండుగ హైదరాబాద్‌లో ప్రారంభమైనట్టు కూడా చరిత్రకారులు చెబుతుంటారు.

బోనం ఎందుకంటే..? రుతుపవనాలు ప్రవేశించి వర్షాకాలం ప్రారంభంకాగానే మలేరియా, టైఫాయిడ్ తదితర విషజ్వరాలతో పాటు ఇతర సీజనల్ అంటువ్యాధులు ప్రబలుతుంటాయి.ఈ సీజనల్ వ్యాధుల నివారణకు బోనాల పండుగకు సంబంధం ఉన్నది.వేపాకు క్రిమినాశినిగా పనిచేస్తుంది.అందుకే రోగ నిరోధకత కోసమే ఇంటికి వేప తోరణాలు కడుతారు.బోనం కుండకు వేపాకులు కట్టడమే కాకుండా..బోనం ఎత్తుకున్న మహిళలు వేపాకులు పట్టుకుంటారు.పసుపు నీళ్లు చల్లడం కూడా అందుకే మొదలైందని అంటారు. భోజనం ప్రకృతి అయితే..దాని వికృతి పదమే బోనం.అన్నం, పాలు,పెరుగుతో కూడిన బోనాన్ని అమ్మవారి కోసం మట్టి లేక రాగికుండలో వండుతారు.ఆ తర్వాత బోనాల కుండలను వేప రెమ్మలతో, పసుపు, కుంకుమతో అలంకరించి దానిపై ఒక దీపం ఉంచుతుంటారు.ఇలా తయారు చేసిన బోనాలను తలపై పెట్టుకుని డప్పు చప్పుళ్లతో మహిళలు ఆలయానికి తీసుకెళ్తారు.ఈ బోనాల కుండలను ఇలా బోనం నైవేద్యంగా సమర్పించే తంతును ఊరడి అంటారు. గ్రామాల్లో దీన్నే పెద్ద పండుగ,ఊర పండుగ వంటి పేర్లతో పిలుచుకుంటారు.ప్రతి ఘట్టమూ ఆవిష్కృతం.. బోనాల జాతర కేవలం అమ్మవారికి నైవేద్యం సమర్పించడంతోనే ముగిసిపోదు.గ్రామీణ సంబురాలకు సంబంధించిన ప్రతి ఘట్టమూ ఇందులో కనిపిస్తుంది.తొట్టెల పేరుతో అమ్మవారికి కర్రలు,కాగితాలతో చేసిన అలంకారాలు సమర్పించడం, రంగం పేరిట భవిష్యవాణి చెప్పే ఆచారమూ ఈ బోనాల పండుగలో ఉంటుంది.అమ్మవారిని ఘటం రూపంలో స్థాపించడం,ఆ ఘట్టాన్ని నిమజ్జనం చేయడాన్ని చూడవచ్చు.పండుగలో జానపద కళలు,డప్పుల చప్పుళ్లు, శివసత్తుల విన్యాసాలతో పండుగ వాతావరణం కనిపిస్తుంది.



# పడగొడతామంటే.. నిలబెడతామంటూ వస్తున్నారు

## సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జులై 14 (ప్రభాత ఉదయం): బీఆర్ఎస్ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు సీఎం రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ హైదరాబాద్‌కు ఏం చేసిందని అంటున్నారని.. ఔటర్ తెచ్చింది తామేనని, ఐటీ తెచ్చింది తామేనని, ఎయిర్ పోర్టు కట్టింది కూడా తామేనని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. ఇక బీఆర్ఎస్ చేసిందేంటంటే.. గంజాయి, డ్రగ్స్ తెచ్చారని రేవంత్ విమర్శించారు. తాము ఏదో ఒకటి చేసుకుంటూ పోతుంటే.. కాళ్లల్లో కట్టె పెట్టే పనిలో బీఆర్ఎస్ వాళ్లు ఉన్నారని మండిపడ్డారు రేవంత్. వీళ్ల పని ఐపోయింది అన్నోడు ఎక్కడ ఉన్నాడు.. కనపడకుండా పోయాడని విమర్శించారు. రోజూ ఎవరున్నారు.. ఎవరు లేరు అని లెక్కపెట్టే పనిలో ఉన్నాడని బీఆర్ఎస్ నాయకత్వంపై సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు. ఈ ప్రభుత్వాన్ని కాపాడితే అభివృద్ధి జరుగుతుందని ప్రకాశ్ గౌడ్ లాంటి వాళ్లు కాంగ్రెస్‌లో చేరారని రేవంత్ చెప్పారు. రేవంత్ సర్కారు బలపడితే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని అందరూ తమవైపు చూస్తున్నారన్నారు. పార్టీలోకి ఏమిస్తా.. నా దగ్గర ఏముందని.. నా అంగీ లాగు అమ్మినా పైసా రాదని రేవంత్ వ్యాఖ్యానించారు. ప్రకాశ్ గౌడ్‌కి, ఎగ్గే మల్లేశంకి పైసలు తక్కువగా ఉన్నాయా?.. ఎగ్గే మల్లేశమే ప్రపంచ బ్యాంకుకి అప్పు ఇచ్చే స్థాయిలో ఉన్నారని రేవంత్ ఆసక్తిర వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రభుత్వాన్ని పడదోస్తామని ఇద్దరు అంబోతుల్లా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్, బీజేపీలపై విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు తమ ప్రభుత్వాన్ని పడగొడతామంటున్నారని.. అయితే, ఎమ్మెల్యేలు మాత్రం నిలబడెతామని తమ దగ్గరికి వస్తున్నారని సీఎం రేవంత్ తెలిపారు. ఎవరేమన్నా.. పదేళ్లు ఈ ప్రభుత్వాన్ని నిలబెడతామంటూ ఎమ్మెల్యేలు ముందుకు వస్తున్నారని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. పదేళ్లు అధికారంలో ఉండి ఏమీ చేయలోనేడో.. ఆరునెలల్లో తాము ఏం చేయలేదని మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని దివాళా తీసినవాళ్లు.. ఏడు లక్షల కోట్లు అప్పులు చేసి తెలంగాణ ప్రజలపై మోపారన్నారు. వారు చేసిన అప్పులకు ప్రతి నెల రూ. 7వేల కోట్లు చెల్లిస్తున్నామని తెలిపారు. ఏడాదికి రూ. 72వేల కోట్లు వడ్డీకే సరిపోతోందన్నారు.



# తెరచుకున్న భాండాగారం

మొదటి పేజీ తరువాయి...

స్ట్రాంగ్‌రూమ్‌ను సీల్ చేశాం" అని ఆలయ ప్రధానాధికారి అరవింద పాధీ వెల్లడించారు. 'విలువైన వస్తువులను తరలించే ప్రక్రియ ఒకేసారి జరగాలి. అందుకు మరింత సమయం పడుతున్నందున వాటిని తరలించకూడదని కమిటీ నిర్ణయించింది. బహుద యాత్ర, సున వేష పూజలు పూర్తైన అనంతరం వాటిని తరలించే తేదీపై నిర్ణయం తీసుకుంటాం" అని అరవింద పాధీ పేర్కొన్నారు. లోపలి గదిని పురావస్తుశాఖ అధికారులు పరిశీలించారని, ఆ ప్రక్రియను మొత్తం చిత్రీకరించామన్నారు.



# హరీష్ రావుకు లైన్ క్లియర్?


## మా వాళ్లు తోపులు- బండి సంజయ్

హైదరాబాద్, జులై 14 (ప్రభాత ఉదయం): భారత్ రాష్ట్ర సమితి.. కొంతకాలంగా వలసల బెడదను తీవ్రంగా ఎదుర్కొంటోంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనే తేడా ఉండట్లేదు. పార్టీ నుంచి బయటికి వెళ్లడానికి వరుస కట్టారు. అధికార కాంగ్రెస్ వైపు కొందరు, భారతీయ జనతా పార్టీలోకి మరి కొందరు చేరిపోతున్నారు. ఇప్పటివరకు మొత్తం తొమ్మిదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ జాబితాలో కడియం శ్రీహరి- స్టేషన్ ఘన్‌పూర్, దానం నాగేందర్- ఖైరతాబాద్, తెల్లం వెంకట్రావ్- భద్రాచలం, పోచారం శ్రీనివాసరెడ్డి- బాన్సువాడ, డాక్టర్ ఎం సంజయ్ కుమార్- జగిత్యాల, కాలె యాదయ్య- చేవెళ్ల, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి- గద్వాల, టీ ప్రకాష్ గౌడ్- రాజేంద్రనగర్, అరికెపూడి గాంధీ- శేరిలింగంపల్లి ఉన్నారు. తాజాగా హరీష్ రావు కూడా పార్టీ ఫిరాయిస్తారనే ప్రచారం రాష్ట్ర రాజకీయాల్లో జోరుగా సాగుతోంది. ప్రస్తుతానికి నిజం కాకపోయినప్పటికీ కొద్దిరోజులగా చర్చల్లో ఉంటూ వస్తోంది. మొన్నటికి మొన్న వన్ ఇండియా తెలుగుకు ఇచ్చిన ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూలో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ దీనిపై స్పందించిన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ కూడా ఇదే విషయంపై మాట్లాడారు. ఈ క్రమంలో ఆయన ఓ అడుగు ముందుకేశారు కూడా. హరీష్ రావును గుడ్ పొలిటీషియన్‌గా ప్రశంసించారు. అదే సమయంలో బీజేపీలో బీఆర్ఎస్ విలీనమౌతుందంటూ వస్తోన్న వార్తలను తోసిపుచ్చారు. అలాంటిదేమీ లేదని వ్యాఖ్యానించారు. హరీష్ రావు- తమ పార్టీలోకి రావాలనుకుంటే రావొచ్చని బండి సంజయ్ చెప్పారు. రాజీనామా చేసి బీజేపీలో చేరాల్సి ఉంటుందని తేల్చి చెప్పారు. ఆయన అనే కాదు ఎవరు తమ పార్టీలో చేరాలనుకున్నా రాజీనామా తప్పదని పేర్కొన్నారు. తమ పార్టీ జెండా కింద పోటీ చేసే అభ్యర్థులను గెలిపించుకునే సత్తా కార్యకర్తలకు ఉందని చెప్పారు. బీజేపీ కార్యకర్తలు తోపులు అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌లో ఉన్న ప్రతి ఎమ్మెల్యే కూడా పార్టీ ఫిరాయించడానికే ప్రయత్నిస్తోన్నారని బండి సంజయ్ అన్నారు. ఏముందని బీఆర్ఎస్‌లో కొనసాగడానికి.. అంటూ వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల్లో తాము ఎనిమిది స్థానాలను గెలిచామని, బీఆర్ఎస్ ఎన్ని గెలిచిందని ప్రశ్నించారు. ఆరు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత రావడం వల్ల అందరూ బీజేపీలో చేరాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. పాపం ఆ పెద్దాయన (కేసీఆర్) ఇప్పటికే గిట్ల పట్టుకుని కూసున్నడు. ఇప్పుడు హరీష్ రావు బీజేపీలో చేరుతుండు అంటూ బ్రేకింగ్ వేస్తే ఏదైనా అయితే మీద పడతది..ఆ పెద్ద మనిషిని ఇబ్బంది పెట్టే పయత్నం చేయకుర్రి.. అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. కేసీఆర్ నిండు నూరేళ్లు, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో బతకాలని కోరుకునే వ్యక్తిని అని చెప్పారు.

# క్షమాపణ చెప్పండి

మొదటి పేజీ తరువాయి...

పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగుల కోసం పోరాటం చేస్తున్నవారి గురించి చేసిన వ్యాఖ్యలను, సీఎం ఉపసంహరించుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోనందునే, నేడు ప్రభుత్వంపై తెలంగాణ యువత భగ్గుమంటోందన్నారు. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి, నిరుద్యోగ యువతకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అలాగే గ్రూప్-2, గ్రూప్-3 ఉద్యోగాల సంఖ్య పెంచాలని కోరారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్న తరుణంలో ఎన్ని ఉద్యోగాలిచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అవసరమైతే వాయిదా తీర్మానంతో శాసనసభను స్తంభింపజేసేందుకు కూడా వెనుకాడమని హెచ్చరించారు. నిరుద్యోగులకు న్యాయం జరిగేదాకా వారికి అండగా ఉంటామన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు నిరుద్యోగులు తెలంగాణ యువతను రెచ్చగొట్టి అధికారం దక్కించుకున్నారని ఎక్స్ వేదికగా కేటీఆర్ విమర్శించారు. నిరుద్యోగులకు అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చి ఇప్పుడు నిరుద్యోగులను మోసం చేస్తుందని కాంగ్రెస్ సర్కారుపై మండిపడ్డారు. నిరుద్యోగులకు మోసపూరిత మాటలు చెప్పిన ఇద్దరికీ రాజకీయ ఉద్యోగాలు వచ్చాయని, వీళ్ల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న కాంగ్రెస్, ఏడు నెలలు గడిచినా ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదని కేటీఆర్ ధ్వజమెత్తారు.



# డొనాల్డ్ ట్రంప్‌పై కాల్పులు

మొదటి పేజీ తరువాయి...

తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే దుండగులు జరిపిన కాల్పుల్లో ఒక వ్యక్తి మరణించినట్లు సమాచారం. మరోవైపు.. కాల్పుల తర్వాత పైకి లేచిన ట్రంప్ 'ఫైట్' అంటూ నినాదాలు చేశారు. ఈ కాల్పుల ఘటనతో అమెరికా సమాజం ఒక్కసారిగా ఉలిక్కి పడింది ఇక ట్రంప్‌పై జరిపిన కాల్పుల ఘటనపై ప్రస్తుత అధ్యక్షుడు, డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి జో బైడెన్ స్పందించారు. ఇలాంటి సంఘటనలను ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. ఈ ఘటనను అందరూ ఖండించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఫెడరల్ ఏజెన్సీలు మొత్తం తనకు వివరించినట్లు తెలిపారు. ప్రస్తుతం డొనాల్డ్ ట్రంప్ పరిస్థితి ఎలా ఉందని తాను డాక్టర్లను సంప్రదించానని.. అయితే ఆయన బాగానే ఉన్నట్లు తెలిపినట్లు చెప్పారు. అమెరికాలో ఇలాంటి హింసకు చోటు లేదని పేర్కొన్న బైడెన్.. ఈ ఘటనను ఉపేక్షించకూడదని పేర్కొన్నారు. తాను ట్రంప్‌తో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. అయితే ఈ కాల్పుల ఘటన హత్యాయత్నమా కాదా అని మీడియా అడిగిన ప్రశ్నకు స్పందించిన బైడెన్.. అది తనకు తెలియదని తెలిపారు. తనకు ఒక అభిప్రాయం ఉందని.. కానీ దానికి సంబంధించిన ఆధారాలు లేవని పేర్కొన్నారు. అన్ని ఆధారాలు లభించిన తర్వాత వ్యాఖ్యానిస్తానని బైడెన్ తెలిపారు.

# ఆల్మట్టికి పెరుగుతున్న వరద

మొదటి పేజీ తరువాయి...

సామర్థ్యం గల అతి పెద్ద ప్రాజెక్టు. ఇంకా ఈ వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని దిగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేసే అవకాశం ఉంటుంది. కాగ ఆల్మట్టి ప్రాజెక్టు నుండి సాగు నీటి అవసరాల కోసం 15,000 క్యూసెక్కుల నీటిని దిగువనకు విడుదల చేశారు. నారాయణపూర్ డ్యాంకు 3,414 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదు కాగ 37.64 టీఎంసిల నీటి సామర్థ్యానికి 25.83 టిఎంసిల నీరు నిల్వ ఉంది. జూరాలకు 3,271 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదు కాగ నీరు జూరాల ప్రాజెక్టు నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు. కానీ ప్రస్తుతం ప్రాజెక్టులో 7.627 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. జూరాల ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న నెట్టెంపాడు లిఫ్టుకు 750, భీమా లిఫ్టుకు 528 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేయగా, ఎడమ కాలువకు 390 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



# సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన హీరో సాయి ధరమ్ తేజ్

మొదటి పేజీ తరువాయి...

మరీ నవ్వారు. దీంతో ఈ వీడియో కాస్త సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది.ఈ వీడియో చూసిన హీరో సాయి ధరమ్ తేజ్ అగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో ఉండే మృగాల నుంచి పేరెంట్స్ తమ పిల్లల్ని కాపాడుకోవాలంటూ విజప్తి చేశారు తేజ్. సదరు వీడియోను పోస్ట్ చేస్తూ సుదీర్ఘంగా ఓ పోస్ట్ చేశారు. దీంతో ఈ వీడియో తెగ వైరల్ అయ్యింది. దీనిపై ఏకంగా తెలంగాణ సీఎం రేవంత్‌తో పాటు డిప్యూటీ సీం మల్లు భట్టి విక్రమార్క సైతం స్పందించారు. . ఈ క్లిష్టమైన సమస్యను లేవనెత్తినందుకు సాయి తేజ్ కు ధన్యవాదాలు తెలిపారు. పిల్లల భద్రత నిజానికి అత్యంత ప్రాధాన్యత అంశం అన్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫమ్‌లలో పిల్లల ఫొటోలు, వీడియోలు దుర్వినియోగాన్ని నిరోధించడానికి తెలంగాణ ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

# తెలంగాణలో 6 వేల పోస్టులతో మరో డీఎస్సీ!

హైదరాబాద్, జులై 14 (ప్రభాత ఉదయం): తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క డీఎస్సీపై కీలక ప్రకటన చేశారు. తెలంగాణలో ఇదే చివరి డీఎస్సీ కాదు, మరిన్ని తెస్తామన్నారు. త్వరలో ఐదు వేల నుంచి ఆరు వేల పోస్టులతో మరో డీఎస్సీ ఉంటుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్రం తెచ్చుకున్నదే యువతకు ఉద్యోగాల కోసమని తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. మూడు నెలల్లో 30 వేల మందికి నియామకపత్రాలు ఇచ్చామని తెలిపారు. మిగిలిన ఉద్యోగాలు ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. 11 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. అధికారంలోకి రాగానే 16 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు. 19,717న మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు, 34 వేల మందిని బదిలీలు చేసినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. మరోవైపు, జులై 11 నుంచి డీఎస్సీ హాల్ టికెట్లు అందుబాటులోకి ఉంచామని, ఇప్పటికే 2,00,500 మంది హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. డీఎస్సీని పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు డిప్యూటీ సీఎం భట్టి. త్వరలో పోస్టుల సంఖ్యతో నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. డీఎస్సీకి అభ్యర్థులు కొన్ని నెలలుగా సిద్ధం అవుతున్నారని, అందుకే జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యావ్యవస్థ బలోపేతం, పేద విద్యార్థులకు మంచి విద్యనందించాలని డీఎస్సీ ప్రకటించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరించారు. గత ప్రభుత్వం నిరుద్యోగులను గాలికి వదిలేసిందని మండిపడ్డ డిప్యూటీ సీఎం.. పదేళ్లు డీఎస్సీని గత ప్రభుత్వం నిర్వహించలేదన్నారు. గ్రూప్-2ను ఇప్పటికే మూడు సార్లు వాయిదా వేశారు. తమ ప్రభుత్వం నిర్వహించడానికి కృషి చేస్తోంది. పరీక్షలు అన్నిసార్లు వాయిదా వేయడం సరికాదు. త్వరితగతిన ఉద్యోగాలు ఇవ్వడమే మా ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి వివరించారు.



# రాష్ట్ర సంస్కృతికి ప్రతీక బోనాలు




ఆలయ కమిటీ ప్రతినిధులకు బోనాల ఉత్సవాల చెక్కులను అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజయ్య, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, కార్పొరేటర్ సంగీత

**రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజయ్య**
**బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**
**సబ్బండ వర్గాలకు సమ ప్రాధాన్యత..**
**రాజేంద్రనగర్ సర్కిల్లో 68 అమ్మవారి దేవాలయలకు రూ.20.06 లక్షల విలువైన చెక్కులు పంపిణీ: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**

రాజేంద్రనగర్,జులై 14(ప్రభాత ఉదయం ఉదయం) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ ప్రతీక బోనాలు అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. బోనాల పండుగను పురస్కరించుకుని దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని 68 అమ్మవారి దేవాలయలకు బోనాల ఏర్పాట్ల కోసం రూ. 20.06 లక్షల విలువైన చెక్కులను ఎస్ఎఫ్ సి చైర్మన్ రాజయ్యతో కలిసి ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజయ్య, ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...తెలంగాణ సంస్కృతిలో భాగమైన బోనాల పండుగలను ప్రతిబస్తీ,కాలనీల్లో ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారని తెలిపారు.ప్రభుత్వం బోనాల పండుగను ప్రతిష్టాత్మకంగా తీసుకొని అన్ని ఆలయాలకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.బోనాల పండుగ సందర్భంగా ఆలయాలవద్ద ఏర్పాట్ల కోసం ప్రత్యేకంగా నిధులు అందజేస్తోందన్నారు.దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం పండుగలకు ఆర్థిక సాయం అందిస్తోందన్నారు.బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తూ సహకరిస్తుందన్నారు.బోనాల పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.రాజేంద్రనగర్ వాడవాడలో బోనాల జాతర వేడుకలను ఎంతో అంగరంగ వైభవంగా జరుపుకోవలనే ఉద్దేశంతో ప్రతిగుడికి బోనాల నిధులు మంజూరయ్యేలా కృషి చేశానన్నారు. బోనాల సందర్భంగా ప్రతి గుడి వద్ద అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు.ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల వసతుల కలిపిస్తూ ప్రశాంత వాతావరణంలో కలిపించాలన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలంత భక్తి శ్రద్ధలతో బోనాల పండుగను జరుపుకోవాలని,భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఆ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజలంతా సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్, రాజేంద్రనగర్ తహసిల్దార్ బొమ్మ రాములు, సంబంధిత అధికారులు,ఆలయాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మార్పీఎస్ నాయకుడు నరేందర్‌ను నిర్బంధించిన ఫామ్ హౌస్‌ను గుర్తించాం

**రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్**

గండిపేట్,జులై 14(ప్రభాత ఉదయం) నార్సింగిలో కిడ్నాప్ గురైన ఎమ్మార్పీఎస్ నేత నరేందర్ ను దుండగులు నిర్బంధించిన ఫామ్ హౌస్ ను గుర్తించామని రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తెలిపారు.ఈనెల 9వ తేదీన నార్సింగిలోని బృందావన్ కాలనీలో ఎమ్మార్పీఎస్ నాయకుడు నరేందర్ కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే..ఇలా ఉండగా కిడ్నాప్ కు పాల్పడిన దుండగులు ఆయనను శనివారం తెల్లవారుజామున ఆయన ఇంటి సమీపంలో వదిలేసి వెళ్లారు.ఈ ఘటనపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టారు.శంషాబాద్ పట్టణంలోని ధర్మగిరి ఆలయ సమీపంలోని ఓ ఫామ్ హౌస్ లో దుండగులు నరేందర్ ని బంధించి చిత్ర హింసలకు గురి చేశారని తెలిపారు.కిడ్నాప్ కు పాల్పడిన దుండగుల ఫామ్ హౌస్ కు ఇరువైపులా భారీ ఎత్తున ప్రహరీ గోడలు నిర్మించి ఉన్నాయని,చుట్టుముట్టు ముళ్లకంచెలు ఉన్నట్లు డీసీపీ వివరించారు.దీంతో పాటు దుండగులు ఫామ్ హౌస్ చుట్టూ సీసీ కెమెరాలు అమర్చుకున్నట్లు ఆయన సూచించారు.



కరాటేలో విజేతలు

## ఘనంగా ముగిసిన ఇంటర్ డిస్ట్రిక్ట్ టైక్వాండో ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్

గద్వాల, జూలై14(ప్రభాత ఉదయం) జోగులాంబ గద్వాల జిల్లా టైక్వాండో అసోసియేషన్ అద్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ ఛాంపియన్ షిప్ లో నాలుగు విభాగాలలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 104 మంది క్రీడాకారులు ప్రథమ, ద్వితీయ స్థానాలలో బంగారు, సిల్వర్ పథకాలు పొందారు, పతకాలు సాధించిన విజేతలకు తెలంగాణ రాష్ట్ర టైక్వాండో కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాస్టర్ కె శ్రీహరి చేతుల మీదుగా బంగారు, సిల్వర్ పతకాలు అందజేశారు. ఈ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్ షిప్ లో విజేతలైనా వారు ఈ నెల 19, 20, 21వ తేదీలలో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి లో జరిగే ఇంటర్ స్టేట్ ఛాంపియన్ షిప్ లో పాల్గొంటారని మాస్టర్ శ్రీహరి తెలిపారు,. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెక్నికల్ డైరెక్టర్ శ్రీనివాసులు, సీనియర్ కోచ్ లు శ్రీనివాస్ శెట్టి, రంగస్వామి, మారుతి, అంజి, రామేశ్వరి, శ్రీను, ఆంజనేయులు, మల్లికార్జున్, రవి, రామాంజనేయులు, లింగేశ్వర్, తోపాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఉద్యమ నేత కెసిఆర్ నాయకత్వంలోనే కొనసాగుతా: పోరెడ్డి ధర్మారెడ్డి

**రాబోయే కార్పొరేట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం..**
**రాజేంద్రనగర్‌లో పార్టీని మరింత బలోపేతం చేస్తాం..**
**రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి**



రాజేంద్రనగర్,జులై 14 (ప్రభాత ఉదయం) ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్, బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలోనే కొనసాగుతానని ,తాను పార్టీ మారే ప్రసక్తే లేదని రాజేంద్రనగర్ డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి అన్నారు.ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పర్ పల్లిలోని బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ధర్మారెడ్డి మాట్లాడుతూ...కేసీఆర్,కేటీర్ నాయకత్వంలోనే తాను పనిచేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేకమైన పాలనపై పోరాటం చేస్తామని వెల్లడించారు.ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్నానని, అధికారం పోగానే పార్టీ మారడం సమంజసం కాదన్నారు.రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అధికార కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయన వెంటే నాయకులు,కార్యకర్తలు వెళ్లారని జరుగుతున్నా ప్రచారాన్ని కొట్టిపారేశారు.కెసిఆర్, కేటీఆర్ అండదండలతో ప్రజాసేవ కోసం నిరంతరం కష్టపడతానన్నారు.రాజకీయాల్లో ఎవరి ఇష్టం వారిది తాను మాత్రం బీఆర్ఎస్ లోనే కొనసాగుతానని వెల్లడించారు.ప్రభుత్వం ప్రజా వ్యతిరేకమైన పాలనపై పోరాటం చేస్తామని తెలిపారు.ప్రజాపాలన అందిస్తున్న కేసీఆర్ ను పక్కన పెట్టి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టిన ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఎందుకు గెలిపించామా అన్న ఆలోచనలో ఉన్నారని తెలిపారు.సీఎం కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్‌గా నిలిచిందన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు కార్యకర్తలను కలుపుకొనిపోయి రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలలో విజయం సాధిస్తామన్నారు. రాష్ట్రంలో మళ్లీ గెలిచేది బీఆర్ఎస్ పార్టీ అని గుర్తు చేశారు.

## ముందస్తు అరెస్టులు ముఖ్యమంత్రి నియంతృత్వానికి నిదర్శనం

**బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్...**




కూకట్‌పల్లి, జూలై 14 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారిక పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్టులు చేయడం ముఖ్యమంత్రి నియంతృత్వానికి నిదర్శనమని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ అన్నారు. అల్విన్ కాలనీ డివిజన్ భూదేవి హిల్స్ కాలనీ లో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ ను ఆదివారం జగద్గిరిగుట్ట పోలీసులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారిక పర్యటన సందర్భంగా ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎలాంటి ధర్నా లేదు ముట్టడి లేదు కానీ పొద్దున్నే నిద్రలేవక ముందే ముందస్తు అరెస్ట్ అని చెప్పి జగద్గిరిగుట్ట పోలీస్ లు ఇంటికి వచ్చి అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తీసుకురావాడన్ని ఆయన తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. అబ్దుల్లాపూర్మెట్ లో ముఖ్యమంత్రి అధికారిక కార్యక్రమ పర్యటనలో అడ్డుకుంటామన్న భయంతో అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కొట్లాడుతున్న నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం చే అప్రజాస్వామికంగా అరెస్ట్ లు చేపించి ఉద్యమాలను అణిచివేయాలనుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది మూరపు చర్య అన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్ ప్రభుత్వ దుందుడుకు విధానాలను ఖండించాల్సిన అవసరం ఉంది అన్నారు. నియంతృత్వ నిరంకుశ కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరిని మార్చుకొని రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలి అన్నారు. లేకుంటే బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామన్నారు.



శ్రీ సీతారామ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళు తున్న కాలనీ వాసులు..

## ఆలయానికి చేరుకున్న విగ్రహ మూర్తులు

**చైతన్య విలాస్ కాలనీ రామాలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి శ్రీకారం**

రాజేంద్రనగర్, జూలై14(ప్రభాత ఉదయం) రాజేంద్ర నగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పరపల్లి చైతన్య విలాస్ కాలనీలో శ్రీ సీతారామచంద్ర ఆలయంలో ఆగస్ట్ 9న విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీకారం చుట్టాలు. భద్రాచలం నుండి విగ్రహం మూర్తులు ఆదివారము ఆలయానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జనప్రియ చౌరస్తా నుండి ఆలయం వరకు మంగళ వాయి ద్యాలతో స్వాగతం పలుకుతూ ఆలయానికి చేరుకున్నారు.ఆలయ కమిటీ ప్రతినిధులు మురళి, మహేష్, రాజేష్ ల ఆధ్వర్యంలో ఆలయం నిర్మాణం పూర్తి చేసుకొని విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి సిద్ధమైంది. కాలనీవాసుల సమిష్టి కృషితో ఆలయ నిర్మాణానికి పునాదులు వేశారు. ఆలయ నిర్మాణం పూర్తి చేసుకొని విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



ఆలయంలో శ్రీ సీతారాముల విగ్రహాలు



ప్రతిష్టాపన శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాల వద్ద భక్తులు

## బీఆర్ఎస్‌లోనే ఉంటా

**రాజేంద్రనగర్ కార్పొరేటర్ పి. అర్చన జయప్రకాష్**



బుద్వేల్, జూలై14(ప్రభాత ఉదయం): కాంగ్రెస్ లోకి రావాలని ఆ పార్టీ పెద్దల నుంచి ఫోన్లు వస్తున్నాయని, తాను మాత్రం బీఆర్ఎస్ లోనే ఉంటానని రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ పొడవు అర్చన జయప్రకాష్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ లో బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. గ్రేటర్ నుంచి నిధులు తీసుకువచ్చి రాజేంద్రనగర్ సర్కిల్ లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కే టీ ఆర్, హరీష్ రావు ల నాయకత్వం లో ముందుకు సాగుతామన్నారు.



హైదర్ గూడ పోచమ్మ ఆలయంలో సమావేశమైన బోనాల ఉత్సవ కమిటీ ప్రతినిధులు

## హైదరుగూడ శ్రీ శ్రీ పోచమ్మ బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం

**ఆలయ ఉత్సవ కమిటీ**

రాజేంద్రనగర్, జూలై14(ప్రభాత ఉదయం) అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదరుగూడ శ్రీ శ్రీ పోచమ్మ దేవా లయం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 28న జరిగే ఉత్సవంలో వివిధ ప్రాంతాల నుండి ప్రజలు పెద సంఖ్యలో పాల్గొంటారని ఆలయ కమిటీ ప్రకటించింది. ఈ మేరకు ఉత్సవాలు ఏర్పాట్లపై ఆదివారం ఉదయం ఆలయ కమిటీ సమావేశం జరిగింది. బోనాల ఉత్సవాలు ఉదయం 6 గంటలకు అభిషేకంతో మొదలై రాత్రి ఘటాల ఊరేగింపుతో ముగుస్తుందని కమిటీ సమావేశం వెల్లడించింది. ఈ ఉత్సవాలలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రమశిక్షణతో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించాలని కమిటీ కోరింది. భక్తులకు ఎ లాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు కమిటీ ప్రకటించింది.

## అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

**బోనాల ఉత్సవాల్లో భవన నిర్మాణ అధ్యక్షుడు చెన్నయ్య**

రాజేంద్రనగర్,జులై 14(ప్రభాత ఉదయం) పురాణపుల్ బోనాల ఉత్సవాల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గం భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు చెన్నయ్య హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా భీష్మ ఆధారంలో పురాణపుల్ నుంచి గోల్కొండ జూలీస్ వరకు బోనాల ఉత్సవాల ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో చెన్నయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.గోల్కొండ వరకు భక్తులు ఊరేగింపుగా వెళ్లి బోనాలను అమ్మవారికి సమర్పించారు.ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ...అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో జీవనం సాగించాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు తెలిపారు.



అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు చెన్నయ్య

## రాజేంద్రనగర్ స్ప్రింగ్ ఫీల్డ్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

స్ప్రింగ్ ఫీల్డ్ హై స్కూల్ కరస్పాండెంట్ జగన్మోహన్ రెడ్డిని సన్మానిస్తున్న విద్యార్థులు




98-99 విద్యార్థుల సమ్మేళనం

**ఆత్మీయ పలకరింపులు ఆటపాటలతో సందడి**

రాజేంద్రనగర్, జులై 14(ప్రభాత ఉదయం) వారంతా వివిధ హోదాల్లో, ఉన్నత స్థానాల్లో, స్థిరపడి పదిమందికి ఉద్యోగ,ఉపాధి కల్పించే స్థాయి కలిగిన వ్యక్తులు..గత 25 సంవత్సరాల క్రితం తాము చదువుకున్న పాఠశాలలో ఆనాటి ఉపాధ్యాయులు, మిత్రులను చూడగానే చిన్నారులుగా మారిపోయి పలకరింపులు,ఆత్మీయ కరచాలనాలతో ఎంతో సందడి చేశారు.ఈ అపూర్వ సంఘటన ఆదివారం రాజేంద్రనగర్ లోని స్ప్రింగ్ ఫీల్డ్ హైస్కూల్ ఆవరణలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే..రాజేంద్రనగర్ లోని స్ప్రింగ్ హై స్కూల్లో (1998 – 1999) పదవ తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఆదివారం ఉదయం "పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని" పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తమకు విద్యాబోధన చేసినటువంటి ప్రిన్సిపాల్ డాక్టర్ పి. జగన్మోహన్ రెడ్డి ,అనితా మేడమ్,ఉపాధ్యాయులు మంజు జోషి,శోభరాణి,శాస్త్రి,కృష్ణయ్య ,సంజయ్ కుమార్,అజీజ్,ప్రభాకర్ తదితర ఉపాధ్యాయులను వారు ఘనంగా సన్మానించారు. వారి పాత జ్ఞాపకాలను తోటి స్నేహితులతో నెమరు వేసుకొని, కుశల ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు.రోజంతా ఆటలు పాటలతో ఎంతో సందడి చేసి తమ జ్ఞాపకాలను తోటి మిత్రులతో పంచుకున్నారు.పూర్వ విద్యార్థులు శ్రావణ్,చరణ్, సుమలత,వాసవి,రాధిక, వరలక్ష్మి,దేవేందర్,సుజాత,నాగలక్ష్మి ,గంగాధర్, స్రవంతి,సుభాష్,నరేందర్, పూర్వ విద్యార్థులు రాజేష్ గౌడ్, శ్రావణ్ కుమార్ , గాయత్రి చరణ్, సుభాష్, నరసింహ, దేవేందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి ,సుమలత రెడ్డి పాల్గొన్నారు.

# కష్టపడిన ప్రతిఒక్కరికి అండగా ఉంటా



### ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేద్దాం... ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు అందేలా కృషి చేస్తా... శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్

కూకట్‌పల్లి, జూలై 14 (ప్రభాత ఉదయం) గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా ఉంటానని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ అన్నారు. ఆదివారం హైదరనగర్ డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ జగదీశ్వర్ గౌడ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృదే ప్రధాన లక్ష్యంగా బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సేవ చేయాలనే ఆశయాన్ని బలం చేకూర్చే విధంగా మీ వెంటే నడుస్తూ శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, కూన సత్యం, డివిజన్ అధ్యక్షులు, యూత్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయాలకు అతీతంగా ఆలయ అభివృద్ధిలో అందరి పాత్ర ఉండాలి: వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి, జూలై 14 (ప్రభాత ఉదయం) ఫతేనగర్ డివిజన్ పరిధిలోని దీన్ దయాల్ నగర్ శివాలయం, పంచముఖి హనుమాన్ ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా జరిగినటువంటి సమావేశంలో కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి విషయంలో భిన్న అభిప్రాయాలు ఉన్నటువంటి స్థానిక నాయకులందరితో మాట్లాడి ఆలయాన్ని అందరం కలిసి ఐక్యమత్యంతో అభివృద్ధి చేసుకోవాలని, రాజకీయాలకు అతీతంగా ఆలయ అభివృద్ధిలో అందరి పాత్ర ఉండాలని అన్నారు. ముందుగా కపిల్ గుప్త విజయ దేవి దంపతులు దాతగా వచ్చినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. అదేవిధంగా మరికొందరు దాతలు ముందుకు రావాలని, దేవాలయ అభివృద్ధికై నా వంతు సహాయం నేనుకూడ చేస్తానని వడ్డేపల్లి రాజేశ్వరరావు సమావేశంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కంచి మహేందర్, బురుగుపల్లి రామ్మోహన్, బస్తీ అధ్యక్షులు కాసుల మహేందర్, ప్రధాన కార్యదర్శి హరి ప్రసాద్, సభ్యులు సతీష్, సాయిలు, నాగేష్, సుదర్శన్, శ్రీనివాస్, గిరి తదితరులు పాల్గొన్నారు.



ధరణి కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

## ధరణి నగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

కూకట్‌పల్లి, జూలై 14 (ప్రభాత ఉదయం): అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో ధరణి నగర్ లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని ధరణి నగర్ లో డ్రైనేజీ, రోడ్లకు సంబంధించి సమస్యలు ఉన్నాయని కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా ఆదివారం కార్పొరేటర్ ధరణి నగర్లో పాదయాత్ర చేసి సమస్యలను ప్రజల నుండి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ధరణి నగర్ కాలనీ గతంలో ఎలా ఉండేదో అందరికి తెలిసిన విషయమే, చిన్న వర్షానికి కూడా ముంపుకు గురైయే కాలనీని అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. పెండింగులో ఉన్న డ్రైనేజీ, సీసీ రోడ్లను సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, భాస్కర్, అగ్రవాసు, మహీందర్ రెడ్డి, సత్యనారాయణ, ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్, రెహమాన్, ప్రేమ్ దాస్ బాలస్వామి సాగర్ పాల్గొన్నారు.



### జాతీయస్థాయి టైక్వాండో ఓపెన్ ఛాంపియన్షిప్‌లో

## కొత్తకోట విద్యార్థికి బంగారు పతకం కైవసం

### విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించిన గ్రాండ్ మాస్టర్

కొత్తకోట, జూలై 14(ప్రభాత ఉదయం) కొత్తకోట పట్టణానికి చెందిన విద్యార్థి జాతీయస్థాయి టైక్వాండో ఓపెన్ ఛాంపియన్షిప్‌లో బంగారు పతకం కైవసం చేసుకున్నారు. హైదరాబాద్‌లో ఈనెల 12, 13,14 తేదీలలోశ్రీ కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయస్థాయి ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీలు వెట్రాన్స్ ఇండియా స్పోర్ట్స్ వింగ్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు ఈ పోటీలకు తమిళనాడు మహారాష్ట్ర,కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్ ,ఒడిస్సా, ఉత్తర ప్రదేశ్ కి చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు .ఈ పోటీలలో కొత్తకోటకు చెందిన గాడ్స్ అన్ వారియర్స్ టైక్వాండో కాడమీ చెందిన మాస్టర్ అబ్దుల్ నబీ శిష్యులు పాల్గొని బంగారు పతకం సాధించాలని తెలిపారు. అండర్ 13 ఇయర్స్, 26 కేజీల విభాగంలో పోంసే ఈవెంట్లో , పాల్గొని ఎస్.కె గౌస్ పాషా బంగారు పతకం సాధించారు. పథకం సాధించిన విద్యార్థికి గ్రాండ్ మాస్టర్ జయంతి రెడ్డి చేతుల మీదుగా పథకం అందజేశారు. ఈ సందర్భంగా మాస్టర్ అబ్దుల్ నబీ, సయ్యద్ మహమ్మద్,అజాద్, జాఫర్ సాదిక్, హరీష్ యాదవ్ ,పృధ్విరాజ్ , శివరాజ్, ఇంతియాజ్, అంజి ,అరవింద, చారి, కురుమూర్తి యాదవ్, మీ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.



పాతబస్తీ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో పూజలు చేస్తున్న ప్రశాసన్ కమిటీ ప్రతినిధులు

## భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న ప్రశాసన్ కమిటీ

రాజేంద్రనగర్, జూలై14(ప్రభాత ఉదయం) చారిత్రాత్మక పాతబస్తీ భాగ్యలక్ష్మి అమ్మవారిని ప్రశాసన్ కమిటీ ప్రతినిధులు దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం రామ రాజ్య ప్రశాసన్ అయోధ్య అఖిల్ భారతీయ ప్రాశాసక్ రాచూరి రాజశేఖర్ ఆద్వర్యం లో జాతీయ రాజ్యసభ రెండవ రోజు మహేశ్వరం మండలం లోని నాగారం లో జరిగినది. రాజ్యసభ సమోరప్ అనంతరం ప్రశాసన్ కమిటీ అంత కలిసి చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారు ను దర్శించుకోవడం జరిగింది. ఆలయ కమిటీ సాదరంగా అమ్మవారికి అర్చన చేయించారు. అనంతరం జాతీయ ప్రశాసక్ భాస్కర్ సింగ్ మాట్లాడుతూ... తెలంగాణ లో రాజ్యసభ విజయవంతం అయ్యిందన్నారు. భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవడం పూర్వ జన్మ సుకృతం అని అన్నారు .తదుపరి రాజ్యసభ వచ్చే ఏడాది రాజస్థాన్ రాష్ట్రం లో నిర్వహించడానికి జాతీయ కమిటీ నిర్ణయించింది .ఈ కార్యక్రమములో జాతీయ సంరక్షక్ వై.శ్రీధర్ ,జాతీయ రాజ్ కోశాధికారి శ్రవణ్, అయోధ్య ప్రాభారీ రవి తివారీ, ఢిల్లీ ప్రముఖ్ శ్రవణ్ సదర్ ,తెలంగాణ ప్రాముఖ్ కేవీ.నర్సింగ్ రావు, ఆంధ్రప్రదేశ్ ప్రముఖ్ పిల్ల వినోద్ కుమార్, రాజస్థాన్ ప్రముఖ్, మహావీర్ డాంగి, ఉత్తరప్రదేశ్ ప్రముఖ్ వికాస్ జి ,మధ్యప్రదేశ్ ప్రముఖ్ వీరేందర్, తెలంగాణ రాజ్ కోశాధికారి కాడెం సుధాకర్, తెలంగాణ సంరక్షక్ మొంద్ర కొమరయ్య, దుర్గాప్రసాద్ అనునాయ్, వివిధ రాష్ట్రాల పదాధికారులు పాల్గొన్నారు.




వైద్యం కోసం సీఎం సహాయ నిధి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

### రోగులకు వైద్య చికిత్స కోసం సీఎం సహాయ నిధి

## చెక్కును అందజేసిన ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 14(ప్రభాత ఉదయం) పేదలకు మెరుగైన వైద్యం అందించటానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గట్టు మండల పరిధిలోని పెంచికలపాడు గ్రామానికి చెందిన చాకలి గంగన్నకి చికిత్స నిమిత్తంఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా సీఎం సహాయనిధి క్రింద 8 వేల రూపాయల, మండల పరిధిలోని లింగాపురం గ్రామానికి చెందిన పుష్పలతకి చికిత్స నిమిత్తం 7 వేల రూపాయల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు హనుమంతు రెడ్డి, నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ లెటర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి



కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా నాయకులు కోరని బాలరాజులు పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

### రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కోరని బాల్ రాజ్‌ను పరామర్శించిన

## టిపిసిసి ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్

రాజేంద్రనగర్,జులై 14(ప్రభాత ఉదయం) అనారోగ్యంతో బాధపడుతున్న రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కోరని బాల్ రాజ్ ని టిపిసిసి ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కోరని బాలరాజ్ గత కొన్ని రోజులుగా అస్వస్థతకు గురై ఇంట్లోనే ఉంటున్నాడు. కోరని బాలరాజును పరామర్శించిన వారిలో పిసిసి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు. జల్ పల్లి నరేందర్,ఏ బ్లాక్ అధ్యక్షులు డప్పు నవీన్ కుమార్, బి బ్లాక్ అధ్యక్షులు ఏండి.ఖలీద్,శంషాబాద్ మున్సిపల్ అధ్యక్షులు పి.సంజయ్ యాదవ్ లు ఆదివారం పరామర్శించారు.రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ బస్తీలోని కోరని బాల్ రాజ్ నివాస గృహంలో అతని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ పరామర్శించిన వారిలో మైలార్ దేవులపల్లి అధ్యక్షులు ఎన్.ధనంజయ,శాస్త్రిపురం డివిజన్ అధ్యక్షులు తాజ్ ఉద్దీన్,సల్మాన్ నగర్ డివిజన్ అధ్యక్షులు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డుంబాల ఉమారెడ్డి, డుంబాల ఝాన్సీ రెడ్డి

## రాజేంద్రనగర్ బాబా క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

బుద్వేల్, జూలై14(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ లోని బాబా క్లినిక్ ఆధ్వర్యంలో శంషాబాద్ సన్ రైజ్ హాస్పిటల్స్ సహకారంతో ఆదివారం రాజేంద్రనగర్ లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని రాజేంద్రనగర్ శ్రీ మాతా పోచమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ డుంబాల ఉమారెడ్డి, రాజేంద్రనగర్ మహిళా మండలి అధ్యక్షురా డుంబాల ఝాన్సీ రెడ్డి లు ప్రారంభించారు. సన్ రైజ్ హాస్పిటల్స్ డాక్టర్ల ఆధ్వర్యంలో178 మంది కి వివిధ రకాల చికిత్స లు అందించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.